
77135

# పసి హృదయాలు

*

శ్రీమతి ఉమారాణి



ఎవరో పిలిచినట్లయితే స్వెట్టర్ అల్లుతున్న మాలతి గబుక్కున తలెత్తి చూసింది. ఎవరో అబ్బాయి. ఏడేళ్లుంటాయి. ముద్దుగా ఉన్నాడు. ఎవరబ్బాయి చెప్మా అనుకుంటూనే "ఎవరబ్బాయ్ నువ్వు" అంది.

"ఏవరయితేనేం లెండి. గిరిబాబున్నాడా?"

అబ్బ ఎంత గీర్వాణం అబ్బాయికి అని అనుకొని "లోపలికి రావోయ్" అంది మాలతి.

"ఊహు .... రాను" తల అడ్డంగా వూపాడు.

"ఏం ? రాకూడదా?" మాలతి ప్రశ్నకు జవాబుగా "అవును" అన్నాడు.

"ఎందుకని ?" కుతూహలంగా అడిగింది మాలతి.

"మీరు బీదవాళ్లుగా .... అందుకని."

చెళ్లున లెంపకాయ తిన్నా మాలతి అలా అవదేమో ! కుర్రాడేమో అతి చిన్నవాడు. ఏమనలేక మాలతి ఒక్కసారి ఆ అబ్బాయి కళ్లల్లోకి సూటిగా చూసింది. లోపల గదిలో పడుకొన్న లెక్చరర్ మాధవరావు తన భార్యకీ, ఇంకో వ్యక్తికీ జరిగే సంభాషణ వింటున్నాడు. ఇంక వినలేక ఇవతలికి వచ్చాడు. ఇంతకీ ఈ అపరిచిత స్వరం ఈ చిన్నబ్బాయిదా ? ఆశ్చర్యంలో మునిగి పోయాడు మాధవరావు.

"అవునుగానీ.... మేం బీదవాళ్లని ఎవరు చెప్పారు ?" అడిగాడు మాధవ.

"మాయింట్లో చెప్పారు. మీరు ముష్టి మూడువందలు తెచ్చుకునే లెక్చరరేగా ?"

మాధవరావు గుటకలు మింగాడు. ఆ అబ్బాయిని పట్టుకుని గబగబ పది గుద్దులు వడ్డించా లనిపించిం దతనికి. మాలతికి అప్పటికి తెలిసింది ఈ అబ్బాయి ఎదిరింటి మేడలో కొత్తగా దిగిన డాక్టరుగా రబ్బాయని. ఈ చిన్నవాడికి కాస్త నోరు దురుసు, పెంకితనం, ముదిగారాబం ఎక్కువని ఆమధ్య ఎవరో అనుకుంటుండగా వింది మాలతి.

"అవునుగానీ .... బాబూ మా గిరి కూడా బీదవాడేగా .... మరి వాడితో ఎలా ఆడుకుంటావ్ ?"

సమాధాన మేం చెప్పాలో తెలీక తెల్ల మొహంవేసి రివ్వున పారిపోయాడా ముది కబుర్ల మొద్దబ్బాయి.

"పాపం. చూడండీ .... ఇంట్లో వాళ్ల మూలంగా పసిడిబాబు లాంటి కుర్రా డెలా తయారయ్యాడో" అంది మాలతి.

"ఆ రెండంటిస్తే సరి. ఇంకా ఖబుర్లు కూడా పెంచావు ఆ వెధవతో."

"ఉష్.... ఏమిటి మీరు మరీను. ఇప్పుడు ఇప్పుడు మనవాడు విన్నాడంటే ఆమాటలే వాడూ నేర్చుకుంటాడు. పిల్లలకేం తెలుస్తుంది. అంతా పెంచడంలో ఉంది" అంది మాలతి.

"అమ్మా .... రమణ వచ్చాడా ?" అంటూ వచ్చాడు గిరిబాబు.

"అంటే ఆ ఎదిరింటివా రబ్బాయా ?"

"అవునమ్మా. బలేబలే బొమ్మలూ, పుస్తకాలూ ఉన్నాయి వాడి దగ్గర. నాతోనే ఆడతాడు. మరెవ్వరితో ఆడడు. అసలు వచ్చాడా ? రాలేదా ? చెప్పు ముందు."

"వచ్చాడు. వెళ్లిపోయాడు. ఇంట్లోకి రాడుట."

"పోనీలేమ్మా. బయట అరుగుమీద ఆడుకుంటాం. వెళ్లిపోయాడా ? అయ్యో. ఎలా ... అదిగో. రమణా, ఒరే రమణా!" అంటూ వీధిలోకి ఒకటే పరుగు. రమణ కూడా గిరి రాగానే అరుగుమీద కొచ్చేవాడు. ఇద్దరూ ఆటల్లో మునిగిపోయారు.

పిల్లలు చాలా అమాయకులు కదా ! వాళ్లకేం తెలుస్తాయి అంతస్థుల భేదాలు. పెద్దవాళ్లు చెప్తేగాని తెలీదు. వాళ్లమధ్య తను కలగజేసుకోకూడ దనుకుంది. మాలతి. గిరి కూడా అలాంటి ఖబుర్లు నేర్చుకుంటే ఎంతసహ్యం ? అయినా తను జాగ్రత్తగా సరిచేస్తే ఏమీ ఫర్వాలేదనుకుంది. పెంపకం సరిగా ఉంటే ఏం భయంలేదు. ఈ ముదిగారాబం ఇలా సాగుతూ ఉంటే ఇంకా ఎన్ని చెడ్డగుణాలేనా నేర్చుకుంటారు పిల్లలు. కాస్త అదుపు ఉండాలి. అనుకుంది మాలతి.

ఒకవారం గడిచింది. ఈ వారం రోజుల్లోనూ ఏ వింతలూ జరుగలేదు. గిరి, రమణా మామూలుగానే ఆటలు, చదువు సాగించుకున్నారు. అతి జాగ్రత్తగా మాలతి గిరిని పరీక్షిస్తోంది.... ఆ మరునాడు.... ప్రొద్దున్న ఇంకా పనిపిల్ల గంగి రాలేదు. ఎక్కడ పని అక్కడే మిగిలుంది. మాలతి నీళ్లు తోడదానికని బాల్చీ తీసికెళ్లింది నూతి దగ్గరకు. గిరి అక్కడే మొహం కడుక్కుంటున్నాడు.




తల్లిని చూచి "ఏమ్మా ? పనిముండ రాలేదా ఇవాళ ?" అన్నాడు. ఉలిక్కిపడింది మాలతి ఇదివర కెప్పుడూ గిరి నోట్లోంచి తిట్లు రాలేదు. తను అనుకున్నదంతా జరుగుతోంది. తన భయం నిజమవుతోంది. గబుక్కున బాల్చీ నూతి చప్టామీద పడేసి "గిరీ ....ఇలా రా .... బాబూ" గిరి వచ్చాడు. భయపడుతూ!

"చూడు బాబూ ! గంగిని అలా అనకూడదు. తిట్లు నేర్చుకోకూడదు. అసలెవరినీ అలా తప్పుడుమాట అనకూడదు." అంది.

"ఏం?" అన్నాడు గిరిబాబు.

"అనకూడని పెద్దాళ్లు చెపితే అనకూడ దంతే. ఏం అని ఎదురు ప్రశ్న వేయకూడదు. తెలిసిందా ?"

గిరి మాట్లాడలేదు.

"ఇలా తిట్టావంటే అందరూ నిన్ను పెంకి అంటారు. నీకు పెంకి అనిపించుకోవాలని ఉందా ? బంగారనిపించుకోవాలని ఉందా ?"

"బంగారని."

"అవునా మరి. అందుకని అలా తిట్టకూడదు. సరేనా ?"

"మరి రమణ మాత్రం తిట్టొచ్చా?"

"రమణ పెంకి. అందరూ రమణను పెంకి అంటున్నారు. ఇలా తిట్టే నిన్ను కూడా పెంకి అంటారు. తెలిసిందా !" తీక్షణంగా చూస్తూ అంది మాలతి.

"వాడితో నేస్తం కట్టి ఇల్లా తిట్లు నేర్చుకునే మాటయితే ఇవాళనుంచి వాడి రావద్దంటాను. ఏమంటావ్?"

"ఒద్దమ్మా. ఇంకెప్పుడూ తిట్టను" అంటూ మాలతిని వాటేసుకున్నాడు గిరి.

* * *

ఒక ఆదివారం. మాలతి వంట చేసుకుంటోంది. ఏమిటో 'బర్' మని చప్పుడు ఆగకుండా వస్తోందని సావిట్లోకి వచ్చి చూసింది మాలతి. ఏముంది? రేడియో పెట్టేస్తున్నాడు రమణ. గిరి ప్రక్కనే నుంచుని చూస్తున్నాడు. తల్లిని చూసి బిక్కమొహం వేశాడు గిరి.

రేడియో ఆపేస్తూ "గిరీ .... రేడియోతో ఆటలేమిటి ?" అంది.

"అది కాదమ్మా. రమణ రేడియోలో పాటలొస్తా యన్నాడు.... అందుకని"

"తప్పు. అలా రేడియోలు, గడియారాలు, పెన్నులు వీటిని ముట్టుకోకూడదు. రమణా! అందులో ఇంకోళ్ల యింటికి వచ్చి యితరుల వస్తువులు తీసుకొని పాడు చెయ్యకూడదు. మీకు రేడియో వినాలని ఉంటే పెద్దాళ్ల నడిగి పెట్టించుకోవాలి. అలా రేడియో బరబర తిప్పెయ్యకూడదు, పాడయిపోతుంది. మరోసారిలా జరుగకూడదు. తెలిసిందా ?" అంది మాలతి.

"ఆ .... ఆ. తెలిసింది. మాయింట్లో బోలెడు రేడియోలున్నాయి. మహా పే...ద్ద" అన్నాడు రమణ తలబిరుసుగా.

మింగేద్దామనుకుంది రమణని. అయినా అణచుకుని, "ఉంటే మీ యింటి కెళ్లి పెట్టుకో. మా రేడియో పాడుచేయక! వెళ్లు" అంది రమణ రయ్యిమని పరుగెత్తి కెళ్లిపోయాడు. గిరివైపు తిరిగి "నే చెప్పింది అర్థమయ్యిందా ?" అని అడిగింది మాలతి. గిరి బుర్ర వూపి అక్కడనుంచి వెళ్లిపోయాడు.

ఆవేళ సాయంత్రమే ఇద్దరు పిల్లలూ లోపలే ఆడుకుంటున్నారు ప్రొద్దున్న జరిగిందంతా మర్చిపోయి. పసిమనసుల్ని నొప్పించడ మెందుకని మాలతి కూడా ఆటంకపర్చలేదు. కానీ వాళ్లని ఒక కంట కనిపెట్టోంది. అక్కడే సావిట్లో కూర్చుని పుస్తకము చదువుకుంటోంది. మాలతి అక్కడే ఉందని పిల్లలిద్దరూ బుద్ధిగా ఆడుకుంటున్నారు. ఇంతలో పక్కింటి రాధ పిలిచినట్లయితే వీధి గుమ్మంలోకి వెళ్లింది మాలతి. అంతే. కాస్సేపటికి డామ్మని పెద్ద చప్పుడు.

ఒక్క అంగలో లోపలి కొచ్చి చూసింది మాలతి. గడియారం క్రిందపడి ముక్కలయింది. గిరి భయంతో ఒకమూల కతుక్కుపోయాడు. రమణ కుర్చీమీద నుంచుని తీవిగా నవ్వుతున్నాడు. మాలతి కోపం అవధులు దాటింది.

"నువ్వు గడియారం ఎందుకు తీశావు రమణా ?" గర్జించింది.

"ఏం తీస్తే ?" ఎదురు ప్రశ్న వేశాడు రమణ.

"ఏమా ? అది మాది. నువ్వెందుకు తీశావ్ ? అలా ఇతరుల వస్తువులు తీయకూడదని ప్రొద్దున చెప్పానా ? చూశావా?

అశోకా రాయల్ టాల్కం పౌడరు మరియు అశోకా స్నో







రక్తాన్ని శుద్ధిచేసి, బాధ కలిగించే వాటినుంచి కాపాడుతుంది. కాళ్ల పగుళ్లు, ఇంకా అనేక రకాలైన చర్మవ్యాధులు ఎగ్జిమా, మొటిమలు, చెమటకాయలు, పెచ్చు లేవడం, పుండ్లు మున్నగునవి చాలావరకు రక్తంలోని దోషంవల్లనే సంభవిస్తవి.
ఇలాంటి వ్యాధులు ఏదో పైపూతలు పూసినంత మాత్రాన తగ్గిపోగలవనుకుంటే చాలా సందర్భాలలో అలా జరగదు. ఒకవేళ పూతలకు తగ్గినట్టు తగ్గినా, వెంటనే మళ్లీ అవి వస్తూ వుంటవి. అందుచేతనే కొంతమంది ఏటేటా ఎగ్జిమా, చెమటకాయలు, మొటిమలు, కాళ్లపగుళ్లు, పుండ్లు మున్నగువాటితో బాధపడుతూ వుంటారు. ఇలాంటి వ్యాధులన్నింటికి అసలు కారణం రక్తదోషమే.
రిచ్‌లెస్ బ్లడ్‌ప్యూరిఫైయర్ సేవిస్తే అది ఎంత చక్కగా పనిచేయగలదో మీకే ఆశ్చర్యం కలిగిస్తుంది. శరీరం అడుగున వుండే గ్రంధు లన్నింటినీ పరిశుభ్రం చేయడమేగాక, మీ రక్తం అత్యంత పరిశుభ్రమౌతుంది. శరీరంపైనవుండే మచ్చలు, ఇతరత్రమైనవన్నీ కూడా అదృశ్యమైపోయి మీ శరీరం తిరిగి ఆరోగ్యప్రదమైన కాంతులీనుతూ వుంటుంది.
రిచ్‌లెస్ లాక్సటీవ్‌ను, గల్లాన్ ఆయింట్‌మెంటునుకూడా వాడండి. కెమిస్టులందరివద్ద, స్టోర్‌లలోను కలవు. వివరాలు తెలిపే కరపత్రాన్ని అడిగి తీసికోండి.

# రిచ్‌లెస్
## బ్లడ్ ప్యూరిఫైయర్

ఇండియా అంతటా ఏజెంట్లు కావాలి. ఈ విలాసానికి వ్రాయండి:
ఇండియాలో సోల్ డిస్ట్రిబ్యూటర్స్
మహేశ్వరీ జనరల్ స్టోర్స్
19/35, పెద్దబజారు, కోయంబత్తూరు-1.
EP.MG-1

# పసి హృదయాలు

ఎలా పగిలిపోయిందో? ఎందుకు ముట్టుకున్నావ్?" మాలతి గట్టిగా అరిచింది.

"నా యిష్టం నేను తీస్తాను."

"నీ యిష్టమా" అంటూ మాలతి రమణని కుర్చీమీద నుంచి దింపి బరబరా గుమ్మం దగ్గరకు లాక్కెళ్లి "వెళ్లిపో. ఇంక ఇంక మా యింటికి రాకు" అని గసిరేసింది.

"హు .... ముష్టి గడియారం" అంటూ గొణుక్కుంటూ వెళ్లిపోయాడు. అలా గడియారాన్ని తియ్యనిచ్చినందుకు గిరిని కోప్పడి విరిగిన గాజుముక్కలు ఏరడంలో మునిగిపోయింది మాలతి.

మర్నాడు సాయంత్రం కొంచెం ఆలశ్యంగా వచ్చాడు గిరి పుస్తకాలన్నీ సర్దుకున్నాడు. గోళీలు, పెన్సిలు ముక్కలు జేబులో వేసుకుని కాఫీ త్రాగేసి,

"అమ్మా ఆడుకోడాని కెళ్తానే" అన్నాడు.

"అదేమిటి బాబూ. ఇప్పుడేగా వచ్చావు."

"ఇప్పటిదాకా స్కూల్లో ఆడానమ్మా.... ఇప్పుడు..."

"ఆ .... ఇప్పుడు .... ఇప్పు డెవరితో ఆటలు?"

"రమణతోనమ్మా."

"ఏడీ రమణ?"

"అదుగో .... ఆ స్తంభం వెనకాల. నువ్వేమన్నా అంటావని అక్కడ దాక్కున్నాడు."

మాలతి ఒక్క క్షణం ఆలోచించింది. చూచీ చూడకుండా వూరుకుంటే అల్లరి కాస్త తగ్గుతుందేమో!

"సరే .... ఆడుకోండి" అంది.

కాసేపయ్యాక "అమ్మా నీకు ఘటోత్కచుడి కధ తెలుసా?" అంటూ వచ్చాడు.

"తెలుసు. ఏం? ఎందుకు?

"చెప్పమ్మా."

"రాత్రి చెపుతాలే."

"కాదు. ఇప్పుడే చెప్పు. రమణ కూడా వింటాడు."

రమణ దూరంగా నుంచున్నాడు. ఇంట్లోకి రాలేదు. కాని మాటలన్నీ వింటునే ఉన్నాడు.

"రమణ వింటాడా? అయితే చెప్పను." అంది మాలతి కోపంగా. తల్లి కోపం గిరికి బాగా తెలుసు. అందుకనే "లేదమ్మా ఇంకెప్పుడూ ఏమీ పాడుచెయ్యడట. నాతో అన్నాడు."

"అవునా రమణా."

"ఊఁ" అన్నాడు రమణ తల వూపుతూ.

"అబ్బ. ఏం టెక్కు. అబ్బాయికి" అని అనుకుంది మాలతి.

ఆరోజునుంచి రోజూ సాయంత్రం కధ చెప్పటం అలవాటయింది. గిరి, రమణ కూడా బుద్ధిగా కూర్చుని కధ వినేవారు. కొన్ని రోజులు గడిచాయి. అల్లరి కూడా కాస్త ఈమధ్య తగ్గిందేమో. ఇంక ఏమీ ఫర్వాలే దనుకుంటుండగానే .... .... ....

*　　*　　*

ఒకనాడు మాసిన చొక్కాలు, లాగులూ ఉతుకుదామనుకుంది మాలతి. డబ్బాలు, బల పాలు జేబుల్లో ఉంటాయిగా. అందుకని జేబుల్లోనివన్నీ ఖాళీ చేస్తోంది. గిరి చొక్కా జేబులో రెండు బీడీ ముక్కలు కని పించాయి మాలతికి. స్పృహ తప్పినట్లయింది. అయితే తను భయపడ్డంతా జరిగింది. ఎంతవరకు వచ్చింది వ్యవహారం. నరాలన్నీ పట్టు తప్పాయి. మాలతికి. ముందు గది లోకి వెళ్లి మాధవరావు చెవిలో వేసింది సంగతి.

"అయితే పాడవడం మొదలయిందన్న. మాట. నువ్వేం ఖంగారుపడకు మాలతీ. నేను సాయంత్రం కనుక్కుంటాగా వాడి సంగతి." అంటూనే లేచి ఆఫీసుకి వెళ్లి పోయాడు.

మాలతి మనసు మనసులో లేదు. సాయంత్రం గిరి రాగానే ఇది తేల్చెయ్యాలి. గిరి పూర్తిగా పాడయిపోయాడు. రమణ మూలంగా. రమణ .... ఈ శనిగా డెక్కడ దాపురించాడు తన ప్రాణానికి!

ఎలా మార్చడం? ఏం శిక్ష విధించాలి? స్నేహం మాన్పిద్దామంటే కుదరదు. ఎదురిల్లే అవడం అదో దౌర్భాగ్యం. ఏం చెయ్యాలో తోచలేదు మాలతికి. ఏడుపొస్తోంది. అన్నం కూడా నోటి కెక్కలేదు మాలతికి. ఏం చెడ్డ స్నేహాలో. ఏమిటో. ఏం చెయ్యడం? పిల్లాడు పాడయిపోతున్నా ఆయనేమీ పట్టిం చుకోటంలేదు. అర్ధంలేని ఆలోచనలన్నీ వస్తు న్నాయి మాలతికి. ఇవాళ బీడీలు .... సిగ రెట్లు .... ఆ తర్వాత. కాస్త పెద్దయ్యాక దొంగతనాలు, త్రాగుడు.... ఇలా దొంగగా, తాగుబోతుగా తయారవుతాడేమో తన గిరి. అందరూ తనని దొంగాడితల్లి అంటారు.... అబ్బ .... గుండెల్లో మంట.... ఇలా పిచ్చి పిచ్చి ఆలోచనల్లో వేగిపోతోంది మాలతి. మనస్సు ఏమీ స్వాధీనంలో లేదు. సాయంత్రం మాధవరావు వచ్చేదాకా అల్లాగే పడి ఉంది మాలతి.

"ఏమిటి ? అలా ఉన్నావు. లే.... లే.... కాస్త కాఫీ ఇవ్వు. అలా క్లబ్ కెళ్లొస్తాను."

"అవునవును. మీకు కాలేజీ .... క్లబ్బు. ఇంట్లో గొడవలేం అక్కర్లేదు...." కోపంగా అంది మాలతి.

"ఇప్పుడేం. కొంప మునిగిందని" అన్నాడు తాపీగా మాధవరావు.

"ఇంకా ఏం జరగాలి!"

"క్లబ్బు నుంచి వచ్చి అడుగుతాను. మాలతీ మనవాడిని. అయినా ఇది మనవాడి పని కాదు....అదిగో.... ఆ కొండముచ్చు పని" అనునయంగా అన్నాడు.

"అయితే మాత్రం. వీడు నేర్చుకోడ మేనా ? రానీండి గిరిని. ఇవాళేం చేస్తానో వాడిని" ఆవేశంగా అంది మాలతి.

"అయితే ఏదో యుద్ధం జరిగేటట్లే ఉంది. నే నింట్లో ఉండడమే మంచిది." బల్లమీద పేపరు చేతిలో తీసికొంటూ అన్నాడు మాధవ.

"మరెప్పుడూ ఇలాంటి పని చెయ్యననే దాకా కొట్టాలని ఉంది."

"కొట్టే ఏం ప్రయోజనం మాలతీ. నువ్వే చెప్పు. ఏమీ ఉపయోగం ఉండదు పిల్లలతో. ఇంకా మొండికేస్తారు. నీకు మాత్రం తెలీదూ, ఇంకేదైనా పనిష్మెంట్ ఆలోచించు."

మాలతి నిట్టూర్చింది. ఏం శిక్ష వెయ్యాలి ? కాఫీ కాస్తూ ఆలోచిస్తోంది .... ....అవును.... అలాగే చెయ్యాలి. గట్టిగా నిశ్చయించుకుంది.

మాధవరావు క్లబ్బు కెళ్లకుండా ఇంట్లోనే ఉన్నాడా సాయంత్రం. 6గం. లకి గిరి వచ్చాడు. "గిరీ" గట్టిగా పిలిచాడు మాధవ రావు. గతుక్కుమన్నాడు గిరిబాబు.

"ఏరా .... ఇవేమిటి ?" బీడీముక్కలు బల్లమీద పెట్టి అడిగాడు.

ఏమీ మాట్లాడలేదు గిరి. ఏడుపు మొహం పెట్టేశాడు.

"ఇది ఎప్పుడు నేర్చుకున్నావు ?"

"రమణ ...." ఏదో చెప్పబోయాడు గిరి.

"రమణ .... రమణ .... ఇకనుంచీ నువ్వా రమణగాడితో మాట్లాడు, నిన్నేం చేస్తానో అప్పుడు చూద్దుగాని .... వెధవా బీడీలు కాలుస్తావురా ? ఛీ .... సిగ్గు లేదూ .... ధూ .... నా కడుపున చెడ బుట్టావు. నీ ముఖం నాకు చూపించకు.... పో...." అంటూ గట్టిగా అరిచి కాళికా స్వరూపిణయి వెక్కివెక్కి ఏడుస్తూ గదిలోకి వెళ్లిపోయింది మాలతి.

గిరి తండ్రిని హత్తుకొని భోరుమన్నాడు. తల్లి ఇలా అరవడం ఇదే మొదటిసారి. ఎక్కిళ్ళు వచ్చేదాకా ఏడ్చాడు. మాధవ కాసేప టికి గిరితో అన్నాడు. "చూడు బాబూ ! ఆ రమణతో మాట్లాడకు. నువ్వు ఇలా బీడీలు, సిగరెట్లు కాల్చకూడదు. తప్పుడు పనులు, మాటలు అనకూడదు. దొంగతనాలు చెయ్యకూడదు. తెలిసిందా ? ఇప్పుడు చెప్పు నీ కెక్కడివి ఇవి."

"రమణ యిచ్చాడు నాన్నా .... అవి కాలిస్తే .... బా .... గా ఉంటుందని"

"అదే .... ఇలాంటి గుణాలన్నీ వాడి మూలాన్నే .... అమ్మ కెంత కోప మొచ్చిందో చూశావా ? నాకూ, అమ్మకీ, కోపం వచ్చే పనులు చెయ్యకూడదు. సరేనా ?"

"మాలతీ .... లేచి అన్నంపెట్టు" మాధవరావు గిరిని తీసికొని లేస్తూ అన్నాడు.

మాలతి మవునంగా అన్నం వడ్డించింది యిద్దరికీ.

ఈ సంఘటన గిరి మనస్సుకు బాగా హత్తుకుంది. గిరికి అన్నం సయించలేదు. రోజూ అమ్మ కులాసాగా ఖబుర్లు చెప్పేది. ఇవాళ మాలతి ముభావం వాడిని బాగా బాధిం చింది. ఆ రాత్రి కూడా తండ్రి దగ్గరే పడు కున్నాడు గిరి. కానీ, చాలా రాత్రిదాకా వాడికి నిద్ర పట్టలేదు. మర్నాడు పొద్దున్న కూడా మాలతి చాలా మవునంగా అన్ని పనులు చేసుకుపోతోంది. గిరి పనులన్నీ మాధవ చేస్తున్నాడు. గిరితో ఒక్క మాట మాట్లా డలేదు మాలతి. గిరిబాబుకి చాలా బాధగా ఉంది. మరెన్నడూ అమ్మకి కోపం తెప్పించ కూడ దనుకున్నాడు. తనే అమ్మని కావి లించుకుని మాట్లాడదా మనుకుంటే గిరికి భయం వేసింది. మాలతి కూడా ఆ అవ కాశం ఇవ్వలేదు. గిరి ఆడుకోవటంలేదు. రమణతో మాట్లాడటంలేదు.

ఆరోజు గడిచింది. అటు మాలతి పను లన్నీ యాంత్రికంగా చేస్తున్నా బాగా బాధ పడిపోతుంది. అన్నం తినటంలేదు. నిద్ర పోడంలేదు. ఇద్దరిమధ్య నలుగుతున్నాడు మాధవరావు. ముఖ్యంగా గిరిని సముదాయించ లేక పోతున్నాడు. గిరి బాధని చూడలేక పోతున్నాడు. వాడి మూగబాధ అతన్ని కదిలించింది.

"ఇంకీ శిక్ష చాలు మాలతీ" అన్నాడు మాధవరావు రెండో రోజు సాయంత్రం. మాట్లాడలేదు మాలతి. "బాబు ఒక్క రోజుకే ఎలా చిక్కిపోయాడో చూడు" అన్నాడు అటువేపే వస్తున్న గిరినిచూపిస్తూ.

మాలతి అటు చూసింది. అప్పుడే గిరి, చేతిలో దువ్వెన పట్టుకుని తండ్రివేపు




ఎంబ్రోసియా
చల్లని పళ్లరస పానీయాలు
మీరూ తాగి చూడండి



ఉత్తమ శ్రేణి సెక్సు పుస్తకాలు
(పెద్దలకు మాత్రము)
సెక్సు అట్లాస్ – (అమెరికన్ ప్రచురణ) 325చిత్రపటములతో రు.5/-; కోకశాస్త్రము 88 చిత్రపటములతో రు. 5/-; వివాహ జీవితం 100 చిత్రపటములతో రు.5/– 60 పడకగది ఫోటోలు రు. 6/–. పోస్టేజి రు. 1-25 అదనం. పూర్తి మొత్తం M. O. ద్వారా పంపవలెను. వి. పి. పి. లేదు.
VANDANA BOOK DEPOT
RafatGanj, Aligarh (UP) (AP2)



సలహా
క్రోల్పోయిన ఆనందం, బలం, శక్తిని తిరిగి యిచ్చేందుకు ఆహ్లాదకరమైనది. నరాల బలంకు పై పూతకు వాడే తైలం. 1 సీసా రు 11-50 స్పెషల్ రకం అర్జంటు గుణంకు రు. 27/- ఎడ్వాన్సు పంపుతూ జవాబుకు కవరు పంపాలి.
డాక్టర్ రత్నం సన్స్,
Sex Specialists (Estd 1904)
ఆజంపురా మార్కెట్ వద్ద, మలకపేట బిల్డింగ్స్
హైదరాబాద్-36 (ఆంధ్ర ప్రదేశ్)



ఇవి చదివేరా?
విద్యార్థులకు:- మీ పిల్లల బాగుకి పనికొచ్చే కొన్ని వందల ఉపయోగ విద్యా వివరాలు రూ.5-00
చేతిపనులు:- ధనసంపాదనకు పనికొచ్చే అనేక వందల మంచి పరుకులు చేసే సులభ మార్గాలు రూ.3-50
మంత్రశక్తి:- మీ కోర్కెలు సిద్ధింపజేసే అనేక మంత్రాలు వాటి గొప్ప రహస్యాలు, సాధన మార్గాలు. రూ.3-50
జీవిత రహస్యాలు: మీ దాంపత్య సుఖానికి వెంటనే తెలుసుకోదగ్గ అనేక కామ సూత్రాలు రూ.3-50
యువతి:- స్త్రీలను గురించి తెలుసుకోదగ్గ అనేక మంచి కుతూహల విషయాలు. రూ. 3-50.
సంతానము:- అవసరం లేనపుడు గర్భం రాకుండా 60 నవీన సులభ మార్గాలు రూ. 3-50
పోస్టుఖర్చులుచితం, దేశసేవ ప్రచురణలు, ఏలూరు, ఆంధ్రకు వ్రాస్తే వి.పి.పోస్టుద్వారా పంపబడును.


## పసి హృదయాలు

వస్తూ తల్లిని చూశాడు. అతి జాలిగా నీళ్లు నిండిన కళ్లతో. మాలతి తనవైపు చూడడం వాడికి సంతోషం కలిగించింది. "అమ్మా" అంటూ ఒక్క పరుగున వచ్చి వళ్లో దూరాడు. "బాబూ! గిరీ" మాలతికి నోట మాట రాలేదు.

"అమ్మా మరెప్పుడూ తప్పుడు పనులు చెయ్యనమ్మా. వాడితో మాట్లాడను. నువ్వేం చెపితే అలా చేస్తాను.... నువ్వు నాతో మాట్లాడు. నన్ను కావలించుకో" బాబు కన్నీళ్లతో అన్నాడు. మాలతి బాబుని గట్టిగా హత్తుకుని ముద్దుల వర్షం కురిపించింది. గిరి ముఖంలో వెయ్యి జ్యోతులు వెలిగాయి.

ఇప్పుడు గిరి ఉత్సాహంగా ఉంటున్నాడు. కానీ, రమణతో మాత్రం మాట్లాడడం లేదు. రమణకీ అనుభవం కొత్తగా ఉంది. గిరి మాట్లాడకపోడం రమణకేమీ బాగు లేదు. రమణని ఇంటికి రావద్దన్నాడు గిరి. ఇదేం నచ్చలేదు రమణకి. ఈమధ్య మాలతి చెప్పే కథలు వాడిని బాగా ఆకర్షించాయి. గిరి తన నింటికెందుకు రానియ్యడంలేదు తెలుసు రమణకి. గిరి ఇంటికి వెళ్లకుండా ఉండలేకపోతున్నాడు. తను చేసే పనులు చెడ్డవని ఇంతవరకు ఎవరూ చెప్పలేదు వాడికి. ఇలా శిక్షించలేదు కూడా! తనదే తప్పు అనుకున్నాడు రమణ.

తను కూడా గిరిలాగ ఉంటే మళ్లీ వాళ్లింటికి వెళ్లొచ్చు. కథలు వినొచ్చు. ఒక సంఘర్షణ లాంటిది బయలుదేరింది వాడి మనస్సులో. మూడు రోజులుగా వాడికేదో బాధగా ఉంది. ఆ సాయంత్రం గిరిని పలకరించాడు రమణ.

"గిరీ, మీ యింటికి వస్తానురా....నాతో మాట్లాడవూ?"

"ఒద్దు. అసలు నాతో మాట్లాడకు."

"కాదురా .... ఒరే .... ఒరే .... నేనేం అనను. అమ్మనేమీ అనను. చెడ్డ పనులు చెయ్యను. బుద్ధిగా ఉంటాను."

"అలా వీల్లేదురా. నువ్వు మా యింటికి రావద్దు" సంచీ భుజానికి తగిలిస్తూ అన్నాడు గిరి.

"కాదురా .... వస్తానురా." రమణని చూస్తే జాలేసింది గిరికి. కానీ, ఎలా? తను రమణతో స్నేహంచేస్తే ఇంకేమైనా ఉందా?

"నువ్వొచ్చి అమ్మ నడుగు. అప్పుడు

మంచిది" ఉపాయం చెప్పాడు గిరి.

రమణకి భయంగా ఉన్నా ఒప్పుకున్నాడు.

గిరి, రమణ వచ్చేసరికి మాలతి ముస్తాబవుతోంది. ఎక్కడికో వెళ్లే సన్నాహం. గిరిని చూడగానే మాలతి,

"రా, రా, గిరీ. తొందరగా తయారవ్వు. సినిమా కెళ్తున్నాం" అంది. గిరి కదల్లేదు. గోడచాటున ఉన్న రమణ కనపడలేదు మాలతికి.

"రా, రా, కదలవేం?" అంది ఆశ్చర్యంగా.

గిరి గుండె అతి వేగంగా కొట్టుకోడం ప్రారంభించింది. మాలతి కేమీ అర్థం కాలేదు.

"ఏమిటి గిరీ? ఏమయింది?" అంటూ గిరి దగ్గరికొచ్చిన మాలతికి రమణ కనపడ్డాడు.

"నువ్వా?" అంది మాలతి కళ్లు పెద్దవిచేసి "ఎందుకొచ్చావ్" అన్నట్లు చూస్తూ.

"మరండీ .... మరే .... మరి .... నేను అల్లరి చేయనండీ ....గిరిలాగ బుద్ధిగా ఉంటానండీ .... బీడీలు లాంటివేమీ ముట్టుకోనండీ .... గిరిబాబుకి కూడా ఇవ్వనండీ ... గిరిని నాతో మాట్లాడమనండి. లేకపోతే నాకు ఏడుపొస్తుందండి." మాలతి దగ్గరగా వచ్చి గబగబ చెప్పేసి ఏడ్చేశాడు. మాలతి ఏమీ మాట్లాడలేదు. ఆలోచిస్తోంది. ఎంత అల్లరి చేసినా వాడూ పసివాడే కదా! వాడి కెవరూ ఇది తప్పు అని చెప్పలేదు కాబట్టే వాడలా తయారయ్యాడు. కానీ .....

"నిజంగానండీ .... నన్ను నమ్మండీ ..." అన్నాడు రమణ ఏడుపుతోనే. మాలతి చటుక్కున రమణని దగ్గరకు లాక్కుని "ఏడవకు రమణా .... బుద్ధిగా ఉంటావుగా .... కళ్లు తుడుచుకో .... తప్పుకదూ ఏడవ్వొచ్చా. ఇదిగో గిరి .... నీతో మాట్లాడుతాడు .... ఆడుతాడు సరేనా. మరి ఏడుపు మానెయ్" అని చెప్తూ నవ్వింది మాలతి. గిరి ఆనందంగా చప్పట్లు కొట్టాడు. రమణ కళ్లు మెరిశాయి. మాలతి తేలిగ్గా ఊపిరి పీల్చుకుంది.

డాక్టరుగారింట్లో మాత్రం ఇదో విడని చిక్కు ప్రశ్నగా మిగిలింది. రమణ బుద్ధిమంతనానికి కారణ మేమిటా? అని వాళ్లను కోని రోజు లేదు.